


తిరుమలలో టీటీడీ ఈవో విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - తిరుమల: శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు టీటీడీ ఈవో జె. శ్యామలరావు, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరితో కలిసి శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలలోని సీఆర్వో కార్యాలయాన్ని ఆధునీకరించేందుకు చేపట్టిన ప్రణాళికలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. భవిష్యత్తులో యాత్రికుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా అధునాతన సౌకర్యాలతో సీఆర్వోను ఆధునీకరించేందుకు ఉన్న అవకాశాలను అధికారులతో ఆరా తీశారు. అదేవిధంగా నూతనంగా నిర్మించిన యాత్రికుల వసతి సముదాయం-5 భవనాన్ని పరిశీలించి వెయిటింగ్ హాళ్లు, శుభ్రత, భద్రత ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ తనిఖీల్లో టీటీడీ చీఫ్ ఇంజనీర్ సత్య నారాయణ, ఈఈ వేణు గోపాల్, డీఈ చంద్ర శేఖర్, డిప్యూటీ ఈవోలు భాస్కర్, సోమన్నారాయణ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రాముడు, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

ఆ ఏనుగు దంతాలు ఎక్కడివి..?

- ఏనుగు దంతాల స్మగ్లింగ్ పై రహస్య విచారణ
- భాకరాపేట ఫారెస్ట్ కార్యాలయంలో పోయినవేనా?
- 3డి టెక్నాలజీతో కృత్రిమ దంతాల తయారీ?
- తెలంగాణ రాచకొండ పోలీసుల ముమ్మర దర్యాప్తు
- ఏనుగు దంతాల స్మగ్లింగ్ పై వినిపిస్తున్న భిన్న స్వరాలు
- డిఎన్ఏ టెస్టుతో నిర్ధారణకు వచ్చే అవకాశం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం స్మగ్లింగ్ దశాబ్దాల తరబడి జరుగుతూనే ఉంది. గడిచిన 35 నుండి 40 సంవత్సరాల కాలంలో వేల టన్నులు ఎర్రచందనం శేషాచలం అడవుల నుండి స్మగ్లర్లు దోచుకెళుతున్నారు. వీరప్పన్ బ్రతికి ఉన్నప్పుడు ముమ్మరంగా వినిపించిన ఏనుగు దంతాల స్మగ్లింగ్ ఇప్పుడు శేషాచలం అడవులకు పాకిందా? అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శేషాచలం అడవుల నుండి ఎర్రచందనంతో పాటుగా ఏనుగు దంతాలను స్మగ్లింగ్ చేసే ముఠాలు ఉన్నాయని ఇటీవల తెలంగాణ రాష్ట్రం ఎల్బీనగర్ జోన్ ఎస్ఓటి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఏనుగు దంతాలు సంఘటనతో తెలుగులోకి వచ్చింది. అయితే తెలంగాణలో పట్టుబడ్డ ఎర్రచందనం స్మగ్లర్ రేకులకుంట ప్రసాద్ వద్ద ఏనుగు దంతాలు పట్టుబడటంతో పలు కోణాలలో ఎల్బీనగర్ పోలీసులు విచారిస్తున్నారు. శేషాచలం అడవుల నుండి ఈ ఏనుగు దంతాలను అంతర్జాతీయ మార్కెట్లో రూ.3 కోట్ల రూపాయలకు విక్రయించడానికి రహస్యంగా తీసుకెళుతుండగా ఎస్ఓటి పోలీసులు అరెస్టు చేయడంతో ఒక్కసారిగా ఆంధ్రప్రదేశ్ తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారులు ఉలిక్కిపడ్డారు. శేషాచలం అడవులలో ఎర్రచందనంతో పాటు వన్యప్రాణుల వేట అనేది తగ్గుముఖం పడుతున్న సమయంలో ఇలా ఏనుగు దంతాలను స్మగ్లింగ్ చేస్తున్నారన్న విషయంపై ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ ఉన్నత స్థాయి అధికారులు కూడా లోతైన దర్యాప్తును చేస్తున్నట్లుగా తెలుస్తోంది.

వాస్తవానికి 2013 తలకోనలో..

శేషాచలం అటవీ పరిధి, తలకోనలో 2013 ప్రాంతంలో ఓ ఏనుగు మరణించడంతో దానిని గుర్తించిన అటవీశాఖ అధికారులు ఏనుగు కళేబరం నుండి దంతాలను వేరుచేసి భాకరాపేట అటవీ శాఖ కార్యాలయంలో భద్రపరిచారు. ఆ సమయంలో ఏనుగు నుండి వేరు చేసిన ఆ దంతాల పొడవు, చుట్టుకొలత, బరువును రికార్డుల్లో నమోదు చేశారు. అయితే 2023లో భాకరాపేట అటవీ శాఖ కార్యాలయంలో భద్రపరిచిన ఏనుగు దంతాలతో పాటుగా రెండు 12 బోర్ పంప్ గన్నులు అపహరణకు గురయ్యాయి. ఈ చోరీకి సంబంధించి భాకరాపేట పోలీస్ స్టేషన్‌లో అటవీశాఖ అధికారులు ఫిర్యాదు చేయడంతో 87/2023 క్రైమ్ నెంబర్‌గా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసు దర్యాప్తులో ఉండగానే 2025 జూన్ 25వ తేదీన ఎల్బీనగర్ పోలీసులకు రెండు ఏనుగు దంతాలు అంతర్జాతీయ మార్కెట్లో విక్రయించడానికి అన్నమయ్య జిల్లాకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్ రేకులకుంట ప్రసాద్ దొరికాడు. వీటిని శేషాచలం అటవీ ప్రాంతం నుండి తీసుకొచ్చినట్లుగా తెలంగాణ పోలీసులకు ప్రసాద్ చెప్పాడు.

అవి.. ఇవి కాకపోతే.. అవి ఎక్కడివి..?

ఇటీవల అటవీశాఖ అధికారులు తెలంగాణ పోలీసులకు పట్టుబడ్డ ఏనుగు దంతాలు ఇక్కడివి కావని దాటవేసే ప్రయత్నం చేశారు. అయితే తెలంగాణలో పట్టుబడ్డ ఏనుగు దంతాలు శేషాచలం ప్రాంతం నుండి అపహరించబడ్డ దంతాలు కాకపోతే తెలంగాణలో పట్టుబడ్డ ఏనుగు దంతాలు ఎక్కడినుండి వచ్చాయో నివృత్తి చేయాల్సిన బాధ్యత పోలీసు అధికారులది. అదేవిధంగా అటవీశాఖ అధికారులపై ఉంది.

డిఎన్ఏ టెస్ట్ ద్వారా నిర్ధారణ..

తెలంగాణలో పట్టుబడ్డ ఏనుగు దంతాలు పోలీసు విచారణ అనంతరం రెండు రాష్ట్రాల పోలీసు, అటవీశాఖ ఉన్నతాధికారుల సమన్వయ నిర్ణయంతో తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారులకు పట్టుబడ్డ ఏనుగు దంతాలను అప్పగిస్తే 2007 జూన్ 6వ తేదీ కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో ద్వారా ఏనుగు దంతాలకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

3డి టెక్నాలజీతో కృత్రిమ దంతాలు?

మారుతున్న కాలానుగుణంగా అందుబాటులోకి వచ్చిన 3డి టెక్నాలజీతో మనకు కావలసిన ఆకృతులలో వస్తువులను తయారు చేసుకునే అవకాశం వచ్చేసింది. ఈ క్రమంలో అంతర్జాతీయంగా ఏనుగు దంతాలను స్మగ్లింగ్ చేసే వారు కూడా పోలీసులను, అటవీశాఖ అధికారులను బురిడీ కుట్టించడానికి 3డి టెక్నాలజీతో తయారుచేసిన కృత్రిమ ఏనుగ దంతాలను పోలీసులకు అప్పజెప్పి దొడ్డి దారిన విదేశాలకు అసలు ఏనుగు దంతాలను స్మగ్లింగ్ చేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఏనుగు దంతాల స్మగ్లింగ్ పై పూర్తిస్థాయి విచారణ జరిగితే తప్ప వాస్తవాలు వెలుగులోకి రాని పరిస్థితి ఏర్పడింది.

కామన్ గుడ్ ఫండ్ మరో 4 శాతం పెంపు

- శ్రీవాణి ట్రస్ట్ నిధులు విడుదల చేయాలి
- టిటిడిలో హిందూయేతరులపై విచారణ జరుగుతోంది : మంత్రి ఆనం



తిరుమలలో శ్రీవారి దర్శనానంతరం టిటిడీ ఛైర్మన్, అదనపు ఈవోలతో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

ప్రజాశక్తి - తిరుమల: కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) నిధుల విడుదల, శ్రీవాణి ట్రస్ట్ నిధులతో నిర్మిస్తున్న ఆలయాల నిర్వహణ పైన ఏపీ దేవాదాయ శాఖ, టీటీడీ కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. శనివారం ఏపీ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడు అధికారులతో తిరుమలలో సమావేశం నిర్వహించారు. గతంలో సీఎం చంద్రబాబు దగ్గర జరిగిన సమావేశంలో ఆలయాలకు సంబంధించిన కొన్ని సమస్యలు ముందుకు రాగా.. వాటిపై ఈ సమావేశంలో చర్చించారు. టీటీడీకి సంబంధించిన సమిష్టి అంశాల పై రెండు విభాగాలు చర్చించి.. ఒక పరిష్కారానికి రావాలని సూచించారు. దేవాదాయ చట్టం ప్రకారం 9 శాతం కామన్ గుడ్ ఫండ్ టీటీడీ నుంచి తీసుకోవాల్సిన నిబంధనలు ఉన్నాయని మంత్రి ఆనం తెలిపారు. గతంలో 5 శాతం ఉన్న దానిని 9 శాతంకు పెంచామన్నారు. రాష్ట్రంలో ఉన్న అర్చక నిరుద్యోగులుగా ఉన్న అర్చక స్వాములకు భృతి ఇవ్వాలనీ మేనిఫెస్టో ఉందని గుర్తు చేసారు. ఆ మేరకు రాష్ట్రంలో 590 వేద పండితులు రాష్ట్రంలో నిరుద్యోగులుగా ఉన్నారని తెలిపారు. వారికి 3 వేల రూపాయలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రంలోని పునర్నిర్మాణంలో ఉన్న ఆలయాలకు రూ. 147 కోట్లు విడుదల కాగా నిలిచిపోయాయని వివరించారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా మరో 11 కోట్లు నిధులు మిగతా ఆలయాలకు రావాల్సి ఉందని పేర్కొన్నారు. వీటన్నింటిని చర్చించి నిర్ణయం తీసుకుంటామని బోర్డు, అధికారులు చెప్పారన్నారు. విజయవాడ దుర్గ గుడికి వెళ్లేందుకు మరో రోడ్డు మార్గం వేసేందుకు టీటీడీ సహకారం కావాలని కోరారు. టీటీడీలో హిందూయేతరులు ఉండేది వాస్తవమని.. కేంద్రమంత్రి బండి సంజయ్ టీటీడీలో పనిచేస్తున్న వేయి మంది హిందూయేతరులు ఉన్నారన్న దానిపై విచారణ కొనసాగుతుందని మంత్రి ఆనం స్పష్టం చేశారు. టీటీడీ కాలేజీ, పాఠశాలల్లో ఉన్న 192 పోస్టులను ఒప్పంద లెక్చరర్‌లతో భర్తీ చేసేందుకు చర్చించినట్లు తెలిపారు.

అశ్రునయనాలతో రాజమ్మకు..వీడ్కోలు



ప్రజాశక్తి-తిరుపతి టౌన్: సిపిఎం పార్టీ సీనియర్ నేత, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాతృమూర్తి కందారపు రాజమ్మకు అశ్రునయనాలతో కుటుంబసభ్యులు శనివారం సాయంత్రం అంతిమ వీడ్కోలు పలికారు. అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతి లోని సిమ్స్ ఆస్పత్రిలో శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందిన రాజమ్మ భౌతికకాయాన్ని సుందరయ్య నగర్ లోని వారి స్వగృహంలో సందర్శనార్థం ఉంచారు. ఈ సందర్భంగా పూతలపట్టు ఎమ్మెల్యే కె మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి, చంద్రగిరి వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, టిటిడి పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు,సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, సిపిఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి రాయపనేని హరికృష్ణ, రిపబ్లిక్ ఎన్ పార్టీ దక్షిణాది రాష్ట్రాల ఇన్చార్జ్ అంజయ్య, తెలుగుదేశం పార్టీ నేత మబ్బు దేవ నారాయణ రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ, టిడిపి నాయకులు మహేష్ యాదవ్, బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ మధు, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ట్రస్ట్ నాయకులు అజీమ్ భాష, జనసేన పార్టీ నాయకులు పొలకల మల్లికార్జున్, రాష్ట్ర ఫారెస్ట్ మాజీ నైనార్ శ్రీనివాసులు, తిరుపతి జిల్లా ప్రజాశక్తి మేనేజర్ ప్రసాద్ , మాజీ మేనేజర్ చంద్రశేఖర్ ,వివిధ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు.. రాజమ్మ భౌతిక కాయానికి ఘనంగా నివాళులర్పించారు. కందారపు మురళితో పాటు వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం.. అశ్రునయనాల మధ్య.. సుందరయ్య నగర్, రైల్వే కాలనీ మీదుగా కరకంబాడి రోడ్డులోని గోవిందదామం వరకు అంతిమయాత్రను నిర్వహించి, అంత్యక్రియలు నిర్వహించారు.

నకిలీ బ్యాంకు స్టాంపుతో రూ. కోటి స్వాహా

- ఆర్పి లత పై చర్యలు తీసుకోవాలి : డాక్టర్ సాయి లక్ష్మి



ఆర్‌పి లతను నిలదీస్తున్న పొదుపు సంఘాల సభ్యులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: బ్యాంకు స్టాంపు తయారు చేసుకొని పొదుపు సంఘాల మహిళలు దాచుకున్న డబ్బులను బ్యాంకులో జమ చేస్తున్నట్టు చూపించి, సుమారు కోటి రూపాయలు స్వాహా చేసిన మూడవ డివిజన్ ఆర్పిని కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపు సంఘాలు మహిళలకు ఆర్థికంగా చేయూతనందించి వారిని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో పొదుపు సంఘాలను ఏర్పాటు చేశారు. ఇందులో మహిళలు రూపాయి, రూపాయి పొదుపు చేసుకొని తన కుటుంబ అవసరాలైన ఆరోగ్యం, పిల్లల చదువులు, పెళ్లిళ్ల వంటి అవసరాలకు వినియోగించుకోవడానికి ఉపయోగపడుతుందని దాచుకున్న సొమ్మును కొంతమంది మెప్మా అధికారులు, బ్యాంకు అధికారులు కుమ్మక్కయి ఆ సొమ్మును కాజేస్తున్నారు. గతంలోనూ ఐద్వా పరిశీలన చేసి కోటి రూపాయల స్వాహా జరగడాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. ఇపుడు యశోద నగర్ ఆర్ పి, స్కావెంజర్ కాలనీ ఆర్ పి, హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఆర్‌పిలు స్వాహా చేశారు. వారిపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం వలన ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయి. ఇప్పటికైనా మెప్మా అధికారులు స్పందించి ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మరియు మహిళల సొమ్మును రికవరీ చేయించాలని లేనిపక్షంలో మహిళలందరినీ ఐక్యం చేసి ఉద్యమిస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

140 మందికి లీటరు పాలు

- చంద్రగిరి బీసీ సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు వసతులు కరువు
- అపరిశుభ్రంగా మరుగుదొడ్లు .. అరకొర నీటి సౌకర్యం
- మెనూ అటకెక్కించి.. నాసిరకం భోజనం వడ్డింపు, నీళ్లు కలిపి పాలు పంపకం



సమస్యల పరిష్కారం కోసం ఆందోళన

ప్రజాశక్తి రామచంద్రాపురం(చంద్రగిరి): పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులు ఫుల్‌గా ఉన్నప్పటికీ.. మౌలిక వసతులు మాత్రం..తూతూ మంత్రంగానే ఉన్నాయి. తిరుపతి జిల్లా నియోజకవర్గ కేంద్రమైన చంద్రగిరిలో సమీకృత బిసి బాలికల హాస్టల్‌లో పారిశుద్ధ్యం లోపించి దుర్వాసనలో విద్యార్థులు గడపాల్సి వస్తున్నది. గత వారం రోజులుగా బీసీ సంక్షేమ బాలికల వసతి గృహంలో నీరు సరఫరా కాకపోవడంతో విద్యార్థులు స్నానానికి, మరుగుదొడ్లల్లో నీళ్లు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం విడుదల చేసిన మెనూ ప్రకారం భోజనం, టిఫిన్, వడ్డించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు బీసీ సంక్షేమ సంఘం నాయకులకు ఫిర్యాదు చేశారు. శనివారం జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు అమర్నాథ్, విద్యార్థి సంఘాల నాయకులు నవీన్ రాజు సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలు ప్రత్యక్షంగా కనిపించాయి. దీంతో హాస్టల్ సంక్షేమ అధికారులను ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పడంతో విద్యార్థులతో కలిసి హాస్టల్ ముందు కూర్చుని సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేశారు. ఒక లీటరు పాలుతో 140 మంది హాస్టల్ విద్యార్థులు అందరకి నీళ్లు కలిపి ఇస్తున్నారని, టిఫిన్లో ఉడికి ఉడకని ఇడ్లీ, నీళ్ల చట్నీ వడ్డిస్తున్నారని ఆరోపించారు. బాత్రూమ్‌లు పరిశుభ్రంగా లేకపోవడంతో విద్యార్థినీలు కంపుతో ముక్కులు మూసుకుని గడపాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఆందోళన విషయం తెలుసుకున్న స్థానిక ఎంపీడీవో వెంకటరత్నం నాయుడు హాస్టల్‌ను సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. చంద్రగిరి బిసి బాలికల సంక్షేమ హాస్టల్లో సమస్యలపై చేసిన ఆందోళన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానిక శాసనసభ్యులు పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి స్పందించి ఎమ్మెల్యే పులివర్తి నానిచే జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి భరత్ రెడ్డితో ఫోన్ చేయించి వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో వెంకటప్ప నాయుడు, బీసీ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్లు రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరించి సంక్షేమ వసతి గృహంలో అన్ని ఏర్పాట్లు చేస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థినిలు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆందోళన విరమించారు.



హాస్టల్‌లో సమస్యలపై వార్డెన్‌ను విచారిస్తున్న ఎంపీడీఓ

జనసేన కార్యకర్త దారుణ హత్య

- సూత్రధారులుగా వినుత దంపతులు
- కీలక నిందితులుగా మరో ముగ్గురు
- విచారిస్తున్న తమిళనాడు పోలీసులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి కోటా వినుత వ్యక్తిగత సహాయకుడు సీహెచ్ రాయుడు అలియాస్ శ్రీనివాసులు(22) దారుణ హత్యకు గురైన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆయన మృతదేహాన్ని చెన్నై నగరంలోని కూవం నదిలో సెవెన్ వెల్స్ పోలీసులు గుర్తించారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన తమిళనాడు పోలీసులు రాయుడు హత్యకేసులో కోటా వినుత, ఆమె భర్త చంద్రబాబులతో పాటు మరో ముగ్గురు జనసేన కార్యకర్తలను నిందితులుగా అనుమానిస్తూ శనివారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. రాయుడు గత 15 సంవత్సరాలుగా వినుత దంపతుల వద్ద కారు డ్రైవరుగా, వ్యక్తిగత సహాయకుడిగా పని చేస్తున్నారు. అయితే గత నెల 22వ తేదీన రాయుడికి, జనసేన పార్టీకి ఇకపై ఇలాంటి సంబంధం లేదనీ, పార్టీ విద్రోహ చర్యల కారణంగా ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు వినుత అధికారిక ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో రాయుడు గత పది రోజుల కిందట అదృశ్యమయ్యాడు. అనంతరం ఈ నెల 8వ తేదీన కూవం నదిలో శవమై కనిపించాడు. వేలా అనే వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు మృతుడి శరీరంపై ఉన్న టాటూ, కత్తి పోట్ల ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీసీ పుటేజీ ఆధారంగా కారు వివరాలు రాబట్టడంతో నిందితులను పట్టుకోగలిగామని తమిళనాడు పోలీసులు తెలిపారు. రాయుడిని ఎక్కడో చంపి శవాన్ని తీసుకొచ్చి కూవం నదిలో పారేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వివాహేతర సంబంధం, పార్టీ విద్రోహ చర్యల కారణంగా హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వినుత భర్త ప్రోత్సాహంతో జనసేన కార్యకర్తలు కావలి శివకుమార్(36), షేక్ తాషన్(28), గోపి (24)లు హత్య చేసి ఆ తరువాత కారులో చెన్నై తీసుకొచ్చి కూవం నదిలో పడేసినట్లు చెప్పారు. విచారణలో భాగంగా వినుత, ఆమె భర్త చంద్రబాబులతో పాటు శివకుమార్, షేక్ తాషన్, గోపీలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.




హత్యకు గురైన రాయుడు, ఇన్‌సెట్‌లో ఫైల్‌ఫోటో)

పార్టీ నుంచి సస్పెండ్ చేసిన జనసేన

జనసేన కార్యకర్త రాయుడు హత్య కేసులో చిక్కుకున్న కోటా వినుతను ఆ పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసింది. ఆమె పార్టీ విధి విధానాలకు భిన్నంగా వ్యవహరిస్తున్నందున ఈ చర్యలు తీసుకున్నట్లు ఆ పార్టీ నేత వేములపాటి అజయ్ కుమార్ ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొద్దిరోజులుగా ఆమెను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచినట్లు తెలిపారు.

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్ చార్జీ వినూత కోటను



శ్రీకాళహస్తి జనసేన ఇంచార్జ్ కోట వినుతను సస్పెన్షన్ ప్రకటిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

జనసేన పార్టీ నుంచి బహిష్కరించినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్‌లు తెలిపారు. కొద్దికాలంగా పార్టీ కార్యకలాపాలకు వినూత దూరంగా ఉన్నట్లు ఎమ్మెల్యే నివాసంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో వారు చెప్పారు. చెన్నైలో వినూతపై హత్యా నేర అభియోగం నమోదు కావడంతో ఆమెను పార్టీ నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. పార్టీ విధివిధానలకు, క్రమశిక్షణకు ఎవరైనా భిన్నంగా నడుచుకుంటే బహిష్కరణకు గురికావడం తథ్యమని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పలుసార్లు హెచ్చించారన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు రాజా రెడ్డి, రాజేష్ ఆచ్చారి, బాబ్జి, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



రాయుడి హత్య బాధాకరం

జనసేన కార్యకర్త రాయుడు హత్య అత్యంత బాధాకరమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. స్థానిక పిఆర్ గెస్ట్ హౌస్ లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ హత్యలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కోట వినుత, ఆమె భర్త కోట చంద్రబాబు ఆరోపణలు ఎదుర్కోవడం, పార్టీ నుంచి సస్పెండ్ కావడం దురదృష్టకరమని అన్నారు. రాయుడి హత్యను రాజకీయం చేయొద్దనీ, వినుత కుటుంబ వ్యక్తిగత సమస్యగా చూడాలని సూచించారు. ఎవరు తప్పు చేసినా కూటమి ప్రభుత్వం సహించదని స్పష్టం చేశారు. రాయుడు మృతదేహాన్ని స్వస్థలం బొక్కిసంపాలెం కు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.

ఐఐటీలో నేడు ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏర్పేడు : ఏర్పేడులో, ఐఐటిలో నిర్మించబడ్డ ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ (కామన్ ఇంక్యుబేషన్ సెంటర్)ను ఆదివారం రాష్ట్ర మంత్రి భరత్‌తో కలిసి కేంద్రమంత్రి చిరాగ్ పాస్వాన్ ప్రారంభించనున్నారు.

సర్కారు తీరుకు నిరసనగా సమ్మె

జిల్లాలో సమ్మె విజయవంతం

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: కార్మికులు దశాబ్దాల తరబడి పోరాడి, వేలాది మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న హక్కులను పాలకులు హరించడం అవివేకం. మోడి పాలనలో దేశం మొత్తం అతలాకుతలమవుతోంది. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, విద్యార్థులు ఒకరేంటి అందరూ అవస్థలు పడుతూనే (ఒక కార్పొరేట్ శక్తులు తప్ప) ఉన్నారు. మోడి సర్కారు అమలు చేస్తున్న ప్రజా వ్యవతిరేక నిర్ణయాలకు నిరసనగా దేశ వ్యాప్త సమ్మెకు కార్మికరంగం పిలుపునిచ్చింది. ఇందులో బాగంగా ఈ నెల 9న తిరుపతి జిల్లా లోని 34 మండలాల్లో సమ్మెను విజయవంతంగా నిర్వహించడం గమనార్హం.

మనదేశంలోని పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్ర బిజెపి మోడి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్ తెచ్చింది. వీటిని రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు, ప్రభుత్వ సంస్థల ప్రవేటీకరణ విరమణ, స్కీమ్‌లలో పని చేసే వారిని కార్మికులుగా గుర్తింపు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ రద్దు, సమాన పనికి సమాన వేతనం తదితర సమస్యల పరిష్కారినికై కార్మిక, ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. దేశ వ్యాప్తంగా సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా జరిగిన 22 సమ్మెలకు ఈ సమ్మెకు చాలా వ్యత్యాసం ఉంది. ఇతర 16 డిమాండ్లు ఉన్నా అన్నింటిలోనూ లేబర్ కోడ్‌లను అడ్డుకోవడం ప్రధాన అంశం. లేబర్‌కోడ్‌లు అమలులోకి వస్తే చట్టాలు వర్తించే కార్మికులు, వర్తించని కార్మికులు అందరు బానిసత్వంలోకి నెట్టబడుతారు. ప్రస్తుతం అమల్లో ఉన్న కార్మిక చట్టాలన్నీ కార్మికవర్గం ఐక్యంగా ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్నవే తప్ప ఎవరి దయా దాక్షిణ్యాల వల్ల పొందలేదు. స్వాతంత్రం రాకముందే బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడి ట్రేడ్ యూనియన్ యాక్ట్ 1926 (సంఘం పెట్టుకునే హక్కు), వేతనాల చెల్లింపుచట్టం 1936, పారిశ్రామిక వివాదాల చట్టం 1947 (ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ యాక్ట్), స్టాండింగ్ ఆర్డర్స్ చట్టం 1946, వర్క్‌మెన్ కాంపెన్సేషన్ యాక్ట్ 1923, లాంటివి సాధించుకుంది. స్వాతంత్రానంతరం కనీస వేతనాల చట్టం 1948, పారిశ్రామిక సంబంధాల చట్టం 1956, ప్రావిడెంట్ ఫండ్ యాక్ట్ 1952, బోనస్ చట్టం 1965, గ్రాట్యూటీ యాక్ట్ 1972, తదితర కార్మిక చట్టాలన్నీ కార్మిక వర్గం ఐక్యంగా పోరాడి సాదించుకున్నవే.

నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారుల, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు, లాభాలను మరింత పెంచడం కోసం లేబర్ కోడ్స్, ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (సులువుగా వ్యాపారం చేసుకోవడం), సబ్‌కా సాత్‌సబ్‌కా వికాస్, మేకిన్ ఇండియా, అమృత్ కాల్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇలా రకరకాల నినాదాలతో దేశ ప్రజానీకాన్ని మభ్య పెట్టి రైల్వేలతో సహా ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని ప్రయివేటీకరిస్తోంది. దేశ సంపదంతా కార్పొరేట్ శక్తులకు చౌకగా, ఉచితంగా కట్టబెడుతున్నది. కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించక కూడదనే, కార్మికోద్యమాలను అణగద్రొక్కటానికి లేబర్ కోడ్స్ తెచ్చింది. లేబర్ కోడ్స్ గనుక అమలైతే ట్రేడ్ యూనియన్స్ ఉనికికే ప్రమాదం ఏర్పడబోతుంది. సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, లేబర్ డిపార్టుమెట్‌తో సంప్ర దించే హక్కు, కలెక్టివ్, బార్గెనింగ్‌లన్నీ ఉండవు. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులు హరించబడుతాయి. నియంతృత్వ పోకడలు పెరుగుతాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తు తరాలకు అండగా ఈ లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలనే ప్రదాన లక్ష్యంతో కార్మిక, ఉద్యోగ సంఘాలు కలిసి దేశ వ్యాప్త సమ్మె చేపట్టాయి. ఈ నెల 9వ తేది తిరుపతి జిల్లా వ్యాప్తంగా సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్‌టియు, ఇతర ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో 34 మండలాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్మికులు, ఉద్యోగులు విధులు బహిష్కరించి, రోడ్డెక్కి, ఎర్రజెండాలు చేబూని నిరసన ర్యాలీలు చేపట్టారు. తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేటలో నల్లబాడ్జీలు దరించి ర్యాలీ చేశారు. కార్మికులకు ప్రజలు సైతం సహకరించి, సమ్మెలో పాల్గొనడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు మూతపడ్డాయి. ఎల్‌ఐసి కార్యాలయాలు, బ్యాంకులు, బిఎస్ఎన్‌ఎల్, పోస్టల్ కార్యాలయాలు స్థంభించాయి. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసిన ఎర్రజెండాల ర్యాలీలతో హోరెత్తింతి. ఇప్పటికైన కేంద్రంలోని మోడి ప్రభుత్వం తన తీరును మార్చుకుని, కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని లేని పక్షంలో పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని కార్మికులు ఈ సమ్మె ద్వారా మరోసారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు.

కందారపు రాజమ్మకు నివాళి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తిరుపతి జిల్లా సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తల్లి రాజమ్మ శుక్రవారం స్వర్గస్తులైనారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని శనివారం ఉదయం గూడూరు సి.పి.ఎం పార్టీ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించిన నాయకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి బి.వి రమణయ్య, అధ్యక్షులు పామంజి మణి, భవన నిర్మాణ సంఘం నాయకులు పుట్టా శంకరయ్య, ఎస్.డి.ఆఫ్, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, ఎంబిటి చంద్రయ్య, నారాయణ బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో శనివారం బాల్య వివాహాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల నిర్లక్ష్యం, యుక్త వయసు బాల బాలికల యొక్క తొందరపాటు, నిరక్షరాస్యత, బాల్య వివాహాలు జరిగి తద్వారా గర్భధారణలతో మాతా, శిశు మరణాలు, అనారోగ్య సమాజం ఏర్పడుతోందన్నారు. అనంతరం వసతి గృహాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వసతి గృహ అధికారిణి సుభాషిణి, ఆరోగ్య పర్యవేక్షకురాలు జ్యోతి, ఆరోగ్య కార్యకర్త రత్నమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి సంవత్సర కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు విస్తృతంగా వివరించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. శనివారం పిచ్చాటూరు, నాగలాపురం, వరదయ్యపాలెం మండలాల్లో ఎమ్మెల్యే పర్యటించి, ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించారు. రామగిరి బజారు వీధిలో భూపతి శెట్టి అనే వ్యక్తి వైద్యం కోసం లేదని తెలుపగా, సదరు వారికి ఫోన్ చేసి రూ.15 వేలు ఫిండ్ వచ్చేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెటింగ్ చైర్మన్ డి.ఇలంగోవన్ రెడ్డి, పద్దు రాజు ఆయకట్టు చైర్మన్ రవి, సుమాంజలి,వాసు రెడ్డి, ఢిల్లీ బాబు, రాజేశ్వరి, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిటిడి జూనియర్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్స్

ప్రజాశక్తి - క్యాంపస్ : టిటిడి జూనియర్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్స్ కౌన్సిలింగ్ ప్రక్రియ తేదీలు ఇంకా ఖరారు చేయలేదు కనుక టిటిడి యాజమాన్యం నిర్ణయానుగుణంగా తేదీలను త్వరలో ప్రకటించడం జరుగుతుంది. విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు సంయమనం పాటించి, ఖచ్చితమైన అడ్మిషన్ తేదీలను తెలుసుకుని కళాశాలకు వచ్చి అడ్మిషన్ పొందాలని, స్పాట్ అడ్మిషన్ తేదీల సమాచారం ఆన్‌లైన్ పోర్టల్‌లో, పత్రికల్లో, వారి మొబైల్‌కి కూడా మెసేజ్ పంపడం జరుగుతుందని ప్రిన్సిపల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ 'చెత్త'కు మోక్షమెప్పుడో!



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: పట్టణంలోని కైలాసగిరి కాలనీలో చెత్త నిర్వహణ పరమ చెత్తగా తయారైంది. గత రెండు వారాలుగా వీధుల్లోని చెత్తను తొలగించక పోవడంతో కుప్పలు తెప్పలుగా చేరింది. దీంతో కైలాస గిరి కాలనీ వాసులు చెత్త కుప్పల నడుమ దుర్వాసనతో, దోమలతో సతమత మవుతున్నారు. కుళ్లిన చెత్త కుప్పలనుండి వచ్చే దుర్వాసనలను భరించలేకన్నామని, అధికారులు స్పందించాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా, వారిలో చలనం లేదంటూ స్థానికులు ఆరోపించారు. నెల నెలా చెత్త పన్ను వసూళ్లలో ఉన్న శ్రద్ధ చెత్త శుద్ధిలో ఎందుకు లేదని ప్రశ్నిస్తున్నారు. సుమారు వెయ్యికి పైగా కుటుంబాలు నివాసం ఉంటున్న కైలాసగిరి కాలనీకి ఒకే ఒక్క పారిశుద్ధ్య కార్మికుడిని నియమించడం వెనక మున్సిపల్ అధికారుల పనితీరు అర్థమవుతోందని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించుకుంటే మున్సిపల్ కార్యాలయం వద్ద చెత్త తోటి నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

శుభం పారమాణికకు డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం సాహిత్య శాస్త్ర పరిశోధక విద్యార్థి శుభం పారమాణిక్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డా.కె.సాంబశివమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్యశాస్త్ర విభాగం సహాయక ఆచార్యులు డా.కె.వీరాంజంద్ర పర్యవేక్షణలో "కావ్య ప్రకాశస్య పంచమ ఉల్లాస పర్యంతస్య మహేష్‌చంద్ర న్యాయరత్న జీవానందవిద్యాసాగర విరచితయోః టీకయోః తులనాత్మకం సమీక్షణం" అనే అంశంపైన పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. శుభం పారమాణిక్ పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్ లలో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు సాహిత్య విభాగ ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

బాల శిరీషకు డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని బయో సైన్స్ అండ్ సెరికల్చర్ విభాగం పరిశోధక విద్యార్థిని కే.బాలశిరీషకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు సిఈ ఆచార్య అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య ఎల్.రాజాన్న మార్గదర్శకత్వంలో "ఎ ప్రొఫైలింగ్ ఆఫ్ పింపిల్ల తిరుపతి ఎన్నిస్ బాల అండ్ సబ్.- అన్ ఎండమిక్ మెడిసినల్ హెర్బ్ ఆఫ్ తిరుమల హిల్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్" అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. ఈమె పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్‌లో అనేక పరిశోధన పత్రాలు ప్రచురించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా బాల శిరీషకు పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

22న నాయీ బ్రాహ్మణ సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఈనెల 22న తిరుపతి నాయి బ్రాహ్మణ సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఉపులపాటి బుజ్జిబాబు తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి నగర పరిధిలోని యూత్ హాస్టల్ లో ఉదయం 10 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించనున్నామన్నారు. ఈ ఎన్నికల్లో ఓటు వేయడానికి నాయి బ్రాహ్మణ సెలూన్ షాపు యజమానులు, ఆ షాపు వర్కర్లు ఎన్నికల ఓటింగ్ పాల్గొనవచ్చున్నారు. ప్రతి ఒక్క నాయి బ్రాహ్మణులు, సెలూన్ షాపు యజమానులకు, వర్కర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎన్నికల అధికారులుగా రామ నారాయణ, ద్వారకానాథ్, సురేంద్ర, పరిశీలకులుగా బుజ్జిబాబు, సిబ్బాల సుధాకర్ వ్యవహరిస్తారన్నారు.

మొదటి ఏడిజె ఏపీపీగా చంద్రశేఖర్ నాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చిత్తూరు జిల్లా కోర్టు సముదాయం లోని మొదటి అదనపు జిల్లా కోర్టు ఏపీపీగా చంద్రశేఖర్ నాయుడును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో కూడా చంద్రశేఖర్ నాయుడు గవర్నమెంట్ లీడర్ గా విధులు నిర్వహించారు. ఏపీపీగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం తో ధనంజయులు, హరి, శ్రీకాంత్, శీను, సాయి, మధు, అనిల్ చంద్రశేఖర్ నాయుడుకి శుభాకాంక్షలు తెలిపారు.

తహాశీల్దార్ నియామకం జరిగేనా..?

➤ రెవెన్యూ సమస్యలు పరిష్కారం అయ్యేనా..? ➤ ఆర్ సి పురం తహాశీల్దార్ ఉద్యోగ విరమణ ➤ ఇంచార్జి తహాశీల్దార్ లేక ప్రజల ఇక్కట్లు

ప్రజాశక్తి - రామచంద్రపురం : తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, రామచంద్రాపురం మండల రెవెన్యూ తహాశీల్దారు వెంకటరమణ జూన్ 30వ తేదీన పదవి విరమణ పొందారు. ఇంచార్జ్ తహాశీల్దారు లేరు. దీంతో రెండు వారాలుగా విద్యార్థులు, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంకటరమణ ఉద్యోగ విరమణ చేసినప్పటి నుండి మండలంలోని రైతులు పట్టాదారు పాసు పుస్తకాలు, భూములను ఆన్లైన్లో నమోదు చేసుకునేందుకు మ్యుటేషన్ దరఖాస్తులు చేసుకుని ఉన్నారు. మరి కొందరు రైతులు గ్రామ కంఠాలలో ఇంటి అనుభవ ధ్రువపత్రాల కోసం, మరి కొంతమంది వివిధ రెవెన్యూ సమస్యలతో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఇంజనీరింగ్, మెడిసిన్, నవోదయ, గురుకుల, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంటర్, ట్రిబుల్ ఐటీ, ఏపీఆర్జేసీల ప్రవేశాలకు కౌన్సిలింగ్‌లు జరుగుతున్నాయి. ఆ కౌన్సిలింగ్‌లకు హాజరయ్యేందుకు విద్యార్థులు కుల, ఆదాయ, ఈడబ్ల్యూఎస్, ఓబిసి ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు చేసుకొని, కార్యాలయాల చుట్టూ పనులు కాక తిరుగుతున్నారు. దరఖాస్తుదారులు, ప్రజలు, విద్యార్థులు సర్టిఫికెట్లు మంజూరు చేయండి సారూ అంటూ కార్యాలయ సిబ్బందిని వేడుకుంటున్నారు. తహాశీల్దారు డిజిటల్ సిగ్నేచర్ లేనందున, ఇన్చార్జి తహాశీల్దారును జిల్లా ఉన్నతాధికారులు నియామకం చేయక పోవడంతో సర్టిఫికెట్లు మంజూరు చేయలేమని సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. దీంతో విద్యార్థులు ఇంజనీరింగ్, మెడిసిన్, డిగ్రీ ప్రవేశాల కౌన్సిలింగుకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నానిలు స్పందించి వెంటనే రామచంద్రా పురానికి రెగ్యులర్ తహాశీల్దారును నియమించా లని ప్రజలు కోరుతున్నారు. ఆర్ సి పురానికి 13 రోజులుగా తాహాసిల్దార్ లేకపోవడంతో పీజిఆర్ఎస్, రెవెన్యూ సదస్సుల సమస్యలు అర్జీలు పరిష్కారం కాకుండా కుప్పలు కుప్పలుగా పడి ఉన్నాయి. రైతులు భూముల వివరాలను ఆన్లైన్లో నమోదు చేసుకునేందుకు మ్యుటేషన్ దరఖాస్తులు కూడా సుమారు 20 కి పైగా పెండింగ్‌లో ఉన్నాయి. కుల, ఈడబ్ల్యూఎస్, ఓబిసి, ధ్రువపత్రాల దరఖాస్తులు సుమారు 50కి పైగా పెండింగ్ ఉన్నాయి. రెవెన్యూ అధికారులు విద్యాలయాలలో ప్రవేశానికి అవసరమైన ధ్రువపత్రాలు మంజూరు చేయకపోతే మా పిల్లల భవిష్యత్ అగమ్యగోచరమవుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులు ర్యాలీ

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మున్సిపల్ పారిశుధ్యకార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులు వెంకటగిరి పురవీధులలో ర్యాలీ చేపట్టారు. ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, గత 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని, రామారావుని బదిలీ చేయాలని నినాదాలు చేశారు. మున్సిపల్ కార్యాలయం నుండి ర్యాలీ బయలుదేరి ఆర్టీసీ బస్టాండు, త్రిభుని సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. ర్యాలీని ఉద్దేశించి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డీపల్లి చెంగయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి సుబ్బయ్య, ఎస్ ప్రసాద్, సుబ్రహ్మణ్యం, రమణయ్య సుబ్బరత్నమ్మ, మహిళా సంఘం నాయకురాలు ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సిఐటియు అనుబంధ సంఘమైన పిచ్చాటూరు ప్రాజెక్టు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులుగా రాజేశ్వరి, ఇంద్రాణిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ప్రసాద్ రావు ప్రకటించారు. శనివారం అంగన్వాడి ప్రాజెక్టు మహా సభలు పిచ్చాటూరులో నిర్వహించారు. ఈ సభలకు అతిథిగా విచ్చేసిన ప్రసాదరావు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేడు అమలు చేయలేదన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పద్మలీల, వాణిశ్రీలు పాల్గొని మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలో తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ప్రాంతీయ కార్యదర్శి నాగలాపురం నాగరాజు, నాయుడుపేట ప్రాజెక్టు నాయకురాలు శ్యామల, తొట్టంబేడు ప్రాజెక్టు నాయకురాలు రేవతి, పిచ్చాటూరు, నాగలాపురం, నారాయణవనం, కేవీబి పురం మండలాల నుండి అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు పాల్గొన్నారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నూతన కమిటీ అధ్యక్షులుగా రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా ఇంద్రాణి, కోశాధికారిగా సుభాషిణిలు ఎన్నికైనట్లు ఆ సంఘం గౌరవాధ్యక్షులు ప్రసాద్ రావు తెలిపారు. కార్యవర్గ సభ్యులుగా సెక్టార్ లీడర్లు కృష్ణవేణి, కళ్యాణి, ప్రమీల, ధనలక్ష్మి, పద్మ, గ్లోరీ, తన్మయి, (పిచ్చాటూరు), సుభాషిణి, సావిత్రి, దీప వీర,విజయ, జయంతి, భువన, (నాగలాపురం) రేవతి, కృష్ణవేణి, జ్ఞానమ్మ, పూర్ణమ్మ, శివ శంకరి,విజయ, బత్తెమ్మ, మంజుల,(కే వి బి పురం), నాగభూషణమ్మ, జయసుధ (నారాయణవనం) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గం, పుత్తూరుకు చెందిన గేట్ పుత్తూరు మాయన్‌కు రూ.27493, వడమాలపేట మండలం, పాదిరేడుకు చెందిన పద్మాకు రూ 6500, నగరి దళిత వాడకు చెందిన జోష్నకు రు. 34,000/- పుదుపేటకు చెందిన టి. కోదండయ్యకు రు.1,85, 813/-, ఏకాంబరకుప్పంకు చెందిన హరి ప్రియకు రు. 50,393/- , సుబ్రమణి కు రు. 30,227/-, కుమారి శేఖర్ కు రు.20000/-, పద్మావతి నగర్‌కు చెందిన సోముకు రు.2,22,600/-లు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరు అయిన చెక్కులను నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ శనివారం పంపిణీ చేశారు.



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే గాలి భాను

తిరుపతిని బాలాజీ డివిజన్‌గా ప్రకటించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కేంద్రంలోని ఎన్డీఏ, కూటమి ప్రభుత్వం విశాఖపట్నంను కొత్త రైల్వే జోన్‌గా ప్రకటించారని, తిరుపతిని కూడా బాలాజీ డివిజన్‌గా ప్రకటించాలని టిడిపి విజనరీ గ్రూపు నాయకులు బుజ్జిబాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. సుదూర ప్రాంతాల నుండి తిరుపతికి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం తిరుపతి రైల్వే స్టేషన్‌లో ఫ్లాట్ ఫారంల సంఖ్యను 8కి పెంచాలన్నారు. ఐఓహెచ్ షెడ్డును, ఇక్కడ ఉన్న భవనాలను వెస్ట్ స్టేషన్‌కు గాని, చంద్రగిరి, తిరుచానూరు లేదా పాకాలకు మార్చాలన్నారు. రాయల చెరువు రోడ్డు నుండి డిఆర్ మహల్ రోడ్డు కలుపుతూ నూతనంగా నిర్మితమవుతున్న తిరుపతి రైల్వే స్టేషన్ భవనాలకు అనుసంధానంగా వెడల్పాటి రోడ్డును ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులను కోరారు. యాత్రికులు, ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వాహనాల పార్కింగ్‌కు అనువైన ఏర్పాట్లను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, మధుసూదన్ యాదవ్, సుబ్బరాయుడు నాయుడు, నిరంజన్ నాయుడు, ప్రసాద్ రావు పాల్గొన్నారు.

విమానాశ్రయం ప్రైవేటీకరణ ఆపాలి : చింతా మోహన్

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట విమానాశ్రయం ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ డాక్టర్ చింతామోహన్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3 వేల ఎకరాల్లో విమానాశ్రయం వుందని, 50 వేల కోట్ల రూపాయలు విలువైన ఆస్తులు కలిగి ఉందని తెలిపారు. అదానీకి 50 వేల కోట్ల ఆస్తిని కట్టబెట్టే దానికి, ఫైల్ రెడీ అయిందని ఆరోపించారు. కేంద్రం బొంబాయి ఎయిర్ పోర్ట్‌ను ఆదానికి అప్పగించిందన్నారు. రాయలసీమలో ఉన్న ఒకే ఒక్క అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అమ్మాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఈ ధర్నాలో కాంగ్రెస్ నాయకులు రావణ్, వడివేలు, మల్లవరం మురళీ, సురేష్, శివ, ముని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోహిత్ రెడ్డిని సత్కరించిన యోగానంద రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా జనరల్ సెక్రటరీగా నియమింప చేసినందుకు గాను వైసిపి చంద్రగిరి నియోజకవర్గ బాధ్యులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని, యువ నాయకులు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిని బ్రాహ్మణపట్టు ఎంపీటీసీ యోగానంద రెడ్డి శనివారం ఘనంగా సత్కరించారు. పార్టీకి సంబంధించిన కార్యక్రమాలను సామాజిక మాధ్యమం ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడానికి కృషి చేస్తానన్నారు.

కల్లూరు మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి - వాకాడు : వాకాడు మండల పరిధిలోని కల్లూరు మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి మేనమామ, కొత్తపాలెంకు చెందిన పెళ్లూరు ప్రభాకర్ రెడ్డి (75) శనివారం మృతి చెందారు. ఆయన మృతికి గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, టిడిపి నాయకులు నివాళులర్పించారు.



ప్రభాకర్ రెడ్డి (ఫైల్ ఫోటో)

17న బెంట్లీ ఇన్నోవేషన్ డే

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్ సాఫ్ట్వేర్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ నెల 17న బెంట్లీ ఇన్వెన్షన్ డే నిర్వహించనున్నట్లు పి ఆర్ ఓ మహేష్ ప్రకటనలో తెలిపారు. స్మార్ట్ సిటీలు, హై-స్పీడ్ రైలు నుండి డిజిటల్ నీటి వ్యవస్థలు, స్థిరత్వంతో కూడిన ఇంధన నెట్‌వర్క్‌ల వరకు మౌలిక సదుపాయాల పరంగా పరివర్తన దశలో భారతదేశం ఉంది. మౌలిక సదుపాయాల రంగాలలో అర్థవంతమైన పురోగతిని నడిపిస్తున్న డిజిటల్ ట్విన్స్, జియోటెక్నికల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాఫ్ట్‌వేర్ పరిష్కారాలను అన్వేషించడానికి ప్రభుత్వం, పరిశ్రమ, సాంకేతిక నాయకులను ఈ కార్యక్రమం ద్వారా ఒకచోట చేర్చనుంది. పరిశ్రమ నాయకుల నుండి పరిజ్ఞానంతో కూడిన చర్చలు, డిజిటల్ ట్విన్ అప్లికేషన్‌ల ప్రత్యక్ష ప్రదర్శనలు, డిజిటల్ డెలివరీ, డిజిటల్ ట్విన్స్ , జియోటెక్నికల్ ఇంజనీరింగ్ సొల్యూషన్‌లు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ఎలా రూపొందించాయి, నిర్మించాయి, నిర్వహిస్తున్నాయి అనే దానిపై ఆకట్టుకునే సెషన్‌లను ఈ కార్యక్రమంతో ఆశించవచ్చు అని పేర్కొన్నారు. బెంట్లీ ఇన్నోవేషన్ డే లో పాల్గొనటానికి ఆసక్తి కలిగిన వ్యక్తులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లిటిల్ ఏంజెల్స్‌లో స్కూల్ క్యాబినెట్ సంస్థాపన



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : లిటిల్ ఏంజెల్ స్కూల్లో క్యాబినెట్ సంస్థాపన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్టీవో మురళీమోహన్, అలిపిరి సిఐ రామ కిషోర్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. స్థానిక యశోద నగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఆర్టీవో మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. సిఐ రామ కిషోర్ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు విద్యార్థి దశ నుండి అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అధినేత రాజగోపాల్ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ శ్వేతా రెడ్డి, చైర్ పర్సన్ రమాదేవి, ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నారాయణ విజయోత్సవ్ -2025



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: నారాయణ విద్యా సంస్థలు పలు పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా మహతి ఆడిటోరియంలో నారాయణ విజయోత్సవ్ 2025 ఘనంగా నిర్వహించారు. జెఈఈ, నీట్ పరీక్షలలో ఓపెన్ కేటగిరీలో జాతీయ స్థాయి 51వ ర్యాంకుతో పాటు, మొదటి వెయ్యిలో 6 అత్యుత్తమ ర్యాంకులను సాధించిన సందర్భంగా విద్యార్థులను శనివారం సత్కరించారు. ఈ విజయోత్సవ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు తిరుపతిలోనే చదివి ఐఐటీ, నీట్ వంటి పరీక్షలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించడం చాల గొప్ప విషయమన్నారు. విద్యాసంస్థల ప్రెసిడెంట్ పునీత్ మాట్లాడుతూ, విద్యార్థులను జీవితంలో అత్యున్నత స్థాయికి తీసుకు వెళ్లటమే తమ లక్ష్యమని తెలిపారు. విద్యాసంస్థల అకాడమిక్ హెడ్ డాక్టర్.ప్రమీల మాట్లాడుతూ, తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో జెఈఈ అడ్వాన్సడ్ లో మొదటి వంద ర్యాంకులలో 30 ర్యాంకులు ఓపెన్ కేటగిరీ లో సాధించారని, నీట్ లో తెలుగు రాష్ట్రాలలోనే కాక దక్షిణ భారత దేశంలో తమ విద్యార్థి 18వ ర్యాంకుతో టాపర్‌గా నిలిచాడని తెలిపారు. డీజీఎమ్ కొండలరావు మాట్లాడుతూ జిల్లాలో తమ విద్యార్థులు 100 కు పైగా ఐఐటీ, నీట్, 50కి పైగా ఎంబిబిఎస్ సీట్లు సాధించడం గర్వకారణమని తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను, అధ్యాపకులను కోర్ డీన్ శ్రీనివాసరావు, డీన్లు ప్రిన్సిపల్స్ జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

15న మంత్రి పర్యటన విజయవంతం చేయండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : 15వ తేదీ గూడూరులో జరిగే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి పాల్గొంటారని, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాయకులు తమ ప్రాంతాల్లో ఎక్కడైనా రోడ్ల సమస్య ఉంటే తెలియజేస్తే మంత్రికి తెలుపుతామన్నారు. ఈ సమావేశంలో శీలం కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, బిల్లు చెంచురామయ్య, శివకుమార్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

నిరవధిక సమ్మెకు సిద్ధం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఏ.పి.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం అర్ధరాత్రి నుండి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వారి సమస్యలు పరిష్కారం కొరకు సమ్మెలోకి వెళ్లనున్నట్టు ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు తెలిపారు. ఎన్నిసార్లు అధికారులకు, నాయకులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇందులో భాగంగా గూడూరు మున్సిపల్ పరిధిలో ఇంజనీరింగ్ విభాగం లో పనిచేస్తున్న కార్మికులను సంబంధిత సి.ఐ.టి.యు నాయకులు జోగి.శివకుమార్, బి.వి.రమణయ్య లు శనివారం ఉదయం మస్టరు పాయింట్ వద్దకు వెళ్లి ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులతో సమ్మె విషయమై చర్చించారు. ఈ కార్యక్రమంలో గూడూరు మున్సిపల్ కార్మిక సంఘం కార్యదర్శి దారా.కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్, సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య, అధ్యక్షులు పామంజి మణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడుదాం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఏదైనా సమస్యలు ఉన్నట్లయితే అందరూ కలిసి పోరాటాలు చేస్తేనే పరిష్కారమవుతాయని బాబాసాహెబ్ అంబేద్కర్ మనవడు భీమ్రావు యశ్వంత్ అంబేద్కర్ పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు పుత్తూరు మండలం, కార్వేటినగరం కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు భద్రత లేదన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్టర్ సుబ్రహ్మణ్యం, అంబేద్కర్ ట్రస్ట్ భవన్ కార్యదర్శి అపరంజి, అంబేద్కర్ ట్రస్ట్ భవన్ కోశాధికారి కుప్పయ్య, సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి మహేష్, టీచర్ వేణు, మున్సిపల్ మాజీ చైర్మన్ అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో మెరుగైన వసతులు కల్పించండి

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ బాలుర, బాలికల హాస్టల్స్ అధ్వనంగా ఉన్నాయని కొన్ని హాస్టల్లో మెనూ ప్రకారం భోజనం అందించడంలేదని ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల శ్రీకాళహస్తిలో బిసి బాలుర, బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ జరిగి విద్యార్థులు అస్వస్థకు గురికావడం బాధాకరమన్నారు. శనివారం చంద్రగిరిలోని బీసీ బాలికల హాస్టల్లో సరైన వసతి సదుపాయాలు లేక, మెనూ ప్రకారం భోజనం కల్పించకపోవడం వలన విద్యార్థులు ధర్నాకు దిగడం జరిగిందన్నారు. అధికారులు వసతులను పర్యవేక్షిస్తున్నారా అని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ ఈ సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్న వార్డన్లను, అధికారులను తొలగించాలని కోరారు.

నేడు స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వహకులకు సత్కారం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ దశమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతి నగర పరిధిలోని కచ్చపి ఆడిటోరియంలో తిరుపతి నగర పరిధిలో వికలాంగులకు, అనాథలకు, శరణార్థులకు సేవ చేస్తున్న 16 స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులకు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌లచే ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందించనున్నట్లు రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన పది సంవత్సరాలుగా నిస్వార్థంగా స్వయార్జిత నగదుతో ఎన్నో సేవా కార్యక్రమాలను చేశానని తెలిపారు. మానవతా దృక్పథంతో సేవ చేస్తున్న స్వచ్ఛంద సంస్థలను మరింతగా ప్రోత్సహించాలన్నారు.ఈ కార్యక్రమంలో భార్గవ్, నెల్లూరు మునిలక్ష్మి, దేవరాజులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రైతుల మోటార్ వైర్లు చోరీ



ప్రజాశక్తి-ఏర్పేడు: శుక్రవారం రాత్రి ఏర్పేడు మండలం, అముదూరు పంచాయతీ, బండివాని పల్లిలో రైతు గుండాల సుబ్బరామయ్యకి సంబంధించి మూడు మోటార్లకు రాగి వైర్లు, దార పెంచలయ్య, పొండయ్య పొలాల్లో మూడు మోటర్లుకు సంబంధించి 40 మీటర్లు కరెంట్ రాగి వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధిత రైతులు ఏర్పేడు పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. మరల కొత్తవి అమర్చాలంటే పదిహేను వేలు నుండి ఇరవై ఐదు వేలు వరకు ఖర్చు అవుతుందని, ఇదంతా సమకూర్చే లోపు పంటలు ఎండిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తగు చర్యలు తీసుకుని చోరీలను అరికట్టాలని కోరుతున్నారు.

30 సవర్లు బంగారు నగలు అపహరణ



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక గమళ్ళ పాళెం ప్రాంతంలో నివాసముంటున్న శివయ్య అనే వ్యక్తి స్థానిక నివ మార్కెట్లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆగస్టు నెలలో తన కుమార్తె వివాహం ఉండడంతో 30 సవర్ల బంగారు ఆభరణాలను ఇంట్లో భద్రపరిచివున్నాడు. శనివారం వేకువఝామున 3గంటల సమయంలో శివయ్య కుటుంబ సభ్యులు పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. అదే సమయంలో అతని కుమారుడు చైతన్య ఇంట్లోనే నిద్రిస్తున్నాడు. ఇదే సమయంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోనికి ప్రవేశించి బీరువాను పగలగొట్టి అందులో ఉన్న 30 సవర్ల బంగారు ఆభరణాలను అపహరించుకు వెళ్లారు. ఉదయం చైతన్య నిద్రలేచి చూసి చోరీ జరిగినట్లు గుర్తించి, ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ గీతాకుమారి పరిశీలించి వివరాలు సేకరించారు. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలం, మర్రిగుంట వద్ద నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్ వద్ద శనివారం పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారిలో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనంపై సర్కిల్ వద్ద నుంచి ఎయిర్పోర్ట్‌కు వెళ్తున్న క్రమంలో, ఎదురుగా వచ్చి స్కార్పియో వాహనం ఢీకొని ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. గాజుల మన్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలియాల్సి ఉంది.


రూ. 30 లక్షలు అప్పు.. 15 మందికి టోపీ



ఎస్పై రవీంద్ర నాథ్‌కు తమ గోడు చెబుతున్న వృద్ధులు

ప్రజాశక్తి - రామచంద్రాపురం: కూలి నాలి చేసి కూడబెట్టిన డబ్బు, ఎన్టీఆర్ భరోసా పింఛన్ డబ్బులు పోగు చేసుకున్న 15 మంది వృద్ధుల నుంచి వడ్డీ ఆశ చూపి అప్పుగా రూ. 35 లక్షలు తీసుకున్న మహిళ అప్పు ఇవ్వలేనని చేతులెత్తేసింది. వృద్ధులు లబోదిబోమంటూ, శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రామచంద్రపురం మండలం, గంగిరెడ్డిపల్లికి చెందిన వెంకట ముని భార్య, లక్ష్మి గ్రామంలోని వృద్ధులను ఎంచుకొని వారు పోగు చేసి పెట్టుకుని ఉన్న డబ్బులను అధిక వడ్డీ ఇస్తానని నమ్మబలికి రూ. 35 లక్షల రూపాయలను అప్పుగా తీసుకుంది. మొదట ఇద్దరు ముగ్గురు వృద్ధుల నుండి అప్పు తీసుకొని వారికి వడ్డీలు సక్రంగా చెల్లిస్తూ నమ్మించింది. దీంతో మరి కొంతమంది వృద్ధులు కూడా అప్పుగా ఇచ్చారు. రాను రాను అప్పు ఇచ్చిన వారు ఎక్కువమంది కావడం, అప్పు మొత్తం కూడా పెరగడంతో వడ్డీలు చెల్లించలేక చేతులెత్తేసింది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం రెడ్డి భార్య, దేశమ్మ దగ్గర మా బంధువుల ఇంటి వద్దకు వెళ్లి రావాలని బంగారు నక్లీసు, గాజులు తీసుకుంది. ఆ బంగారును తిరిగి ఇవ్వమని దేశమ్మ కోరగా రామచంద్రాపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో కుదవ పెట్టానని, త్వరలో డబ్బులు కట్టి ఇప్పిస్తానని చెప్పింది. రెండేళ్లు అవుతున్నా బంగారు నగలు ఇవ్వకపోగా, అప్పుగా తీసుకున్న డబ్బులు, వడ్డీలు చెల్లించకపోవడంతో సుబ్రహ్మణ్య రెడ్డి ఆమెను నెల క్రితం గట్టిగా నిలదీశాడు. దీంతో అప్పు చెల్లించమని వేధిస్తున్నారని లక్ష్మి ఆర్‌సి పురం పోలీసులకు సుబ్రమణ్యం రెడ్డిపై ఫిర్యాదు చేసింది. ఈ ఘటనతో మిగిలిన వృద్ధులు కూడా డబ్బులు ఇవ్వమని ఒత్తిడి చేయడంతో, డబ్బులు ఇవ్వలేను, దిక్కున్న చోట చెప్పుకోండంటూ ఎదురు తిరిగింది. ఆ 15 మంది వృద్ధులు శనివారం ఎస్పై రవీంద్ర నాథ్‌కు తమ వద్దనున్న ఆధారాలతో ఫిర్యాదు చేసి, మా డబ్బులు మాకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. దీంతో ఆర్‌సి పురం పోలీసులు లక్ష్మిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి తీసుకున్న డబ్బులు ఎప్పుడు ఇస్తావని అడగగా, నేను ఇవ్వలేను.. నన్ను వేధిస్తే ఆత్మహత్య చేసుకుంటానని సమాధానం చెప్పింది. పోలీసులు ఏమి చేయలేక వృద్ధులకు నచ్చ చెప్పారు. అప్పులు తీసుకున్న లక్ష్మి పుత్తూరు కోర్టులో ఐపి దాఖలు చేసినట్లు సమాచారం.

సుబ్బరత్నమ్మ మృతిపట్ల సంతాపం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, తిరుమల కుప్పం మాజీ సర్పంచ్ గాలి రామచంద్ర నాయుడు సతీమణి జి.ఆర్. సుబ్బరత్నమ్మ (65 మృతిపట్ల రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, చిత్తూరు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు సంతాపం ప్రకటించారు. ఆమె పార్థీవ దేహానికి నివాళులు అర్పించి, ఆమె కుమారుడు, టీడీపీ సీనియర్ నాయకులు సతీష్ నాయుడు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు బాలాజీ, ఈశ్వర్ ప్రసాద్, రవి నాయుడు, గిరి, మురుగేష్ తదితర నేతలు పాల్గొన్నారు.

ఆడికృత్తిక బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న చంద్రగిరి ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి - రామచంద్రపురం:తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం స్థానిక ఊట్లవారిపల్లి సమీపంలో ఆనందగిరి పై వెలసిన శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం 77వ ఆడికృతిక బ్రహ్మోత్సవం ఏర్పాట్ల పై సమీక్ష సమావేశం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో ఈ.ఓ యువరాణి అధ్యక్షతన, అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలో నిర్వహించారు.ఈ సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ ఐదు రోజులు పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిద్దామని అన్నారు.ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత సొంత మండలంలో వెలసిన శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించినున్న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిపించాలని పేర్కొన్నారు. అంతేకాకుండా ఇది దైవకార్యం కావడంతో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు.ఆడికృతిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో మాట్లాడి పలు సూచనలు సలహాలు స్వీకరించామని అన్నారు.భక్తులకు తాగునీరు,అన్నప్రసాదం సౌకర్యం కల్పించాలని,ఆలయం పరిసరాల చుట్టూ శానిటేషన్ చేయించాలని అన్నారు.ప్రత్యేకంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయాలిని,పోలీసు యంత్రాంగం ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు చోటుచేసుకు పోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పార్టీలకు అతీతంగా ఆడుకృతిక ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులకు,మండల స్థాయి అధికారులకు తెలియజేశారు.ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో అధికారులు,ఇతర శాఖలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఓంశ్రీ సాయి రాం వృద్ధాశ్రమం నందు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి దాతలుగా మెడనూరు సురేష్ రెడ్డి , శాంతి దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ సేవలు అభినందనీయమన్నారు.. దాతల సహకారం మరువలేని దన్నారు.ప్రతి ఒక్కరు సేవా దృక్పధాన్ని అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ , బండి ధనుంజయ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

శివుని సేవలో మంత్రి కొల్లు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శని వారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వర ఆయనకు విచ్చేశారు వీరికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామీ అమ్మవార్లను దర్శించు కున్నారు. అదేవిధంగా మాజీ స్పీకర్ యనమల రామకృష్ణుడు కూడా కుటుంబ సమేతంగా ముక్కంటిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వీరికి ఊరందూరులో ఆతిథ్యం ఇచ్చారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర భివృద్ధి అని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు.సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గూడూరు మండల పరిధిలోని కొమ్మనేటూరు , నేర్నూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి , సంక్షేమం టీడీపీ తోనే సాధ్యమన్నారు . టీడీపీ హయాంలో తప్ప , ఏ ప్రభుత్వ హయాంలో జరగలేదు అన్నారు. అనంతరం ఉచిత గ్యాస్ , తల్లికి వందనం, పెన్షన్ పథకాల పై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మట్టం శ్రావణి రెడ్డి, చిన్న వై.ఎస్.ఆర్ , స్థానిక నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డిఏ విడుదల చేయాలి



విశ్రాంత ఉద్యోగులకు డిఎ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:

తిరుపతి యల్ఐసి రోడ్ లోనీ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయ భవనంలో శనివారం సంఘం నెల వారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్లో ఉన్న అన్ని డీఏలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాలని, విశ్రాంత ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు శంకర్ డిమాండ్ చేశారు. ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా ఫలితం లేదని, వచ్చే నెలలో ప్రభుత్వంపై పోరాడే విషయంలో రాష్ట్ర స్థాయి సంఘంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, సహఅధ్యక్షుడు గోపాల్, సంఘం జిల్లా కోశాధికారి టీ. సిద్ధయ్య, నగర శాఖ కోశాధికారి మునికృష్ణ, జాయింట్ సెక్రటరీలు వాసుదేవ రెడ్డి, కృష్ణయ్య, రవణప్ప, పాపయ్య, జయలక్ష్మి, మెహరున్నీబీ, మునిరత్నం నాయుడు, పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం వైద్య శిబిరం నిర్వహించారు.

మిగిలిపోయిన సీట్లు భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో వివిధ తరగతుల్లో మిగిలిపోయిన సీట్లు భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు స్థానిక బాలుర గురుకుల పాఠశాల ప్రధానాచార్యులు సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 5,6,7,8 తరగతులతో పాటు 9వ తరగతిలోనూ మిగిలిపోయిన సీట్లు భర్తీకి సంబంధించి ప్రవేశ పరీక్షల నిమిత్తం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు.స్టడీ సర్టిఫికెట్,ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ ఫోటోను తీసుకొచ్చి దరఖాస్తులను పూరించి సమర్పిస్తే విద్యార్థులకు వెంటనే హాల్ టికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు.జూలై 20వ తేదీన ఉదయం 10:30 నుంచి 12:30 గంటల వరకు స్థానిక బాలుర గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షల్లో వచ్చే మార్కులు ఆధారంగా మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయడం జరుగుతుంద న్నారు. జూలై 12 నుంచి 19వ తేదీ వరకు దరఖాస్తులు కళాశాలలో అందుబాటులో ఉంటుందన్నారు. దరఖాస్తులు సమర్పించుకోవడానికి జూలై 19 తుది గడువు అన్నారు.మరిన్ని వివరాల కోసం ప్రధాన ఆచార్యులు మొబైల్ నెంబర్లు 9912182725,7989369199నం సంప్రదించాలన్నారు.

భారీగా దర్శన టోకెన్లు కుదింపు

ప్రజాశక్తి - తిరుమల:ఎస్ఎస్డి, ఆన్లైన్ రూ. 300 దర్శనం టిక్కెట్లు టోకెన్లు కుదింపు వల్ల భక్తులు అసంతృప్తికి లోను అవుతున్నారు. గతంలో అడిషనల్ ఈవో పర్యవేక్షణలో ఇరవై ఐదు వేల ఐదు వందల యస్యస్డి టిక్కెట్లు విడుదల అయ్యేవి. కీనీ నేడు పన్నెండు వేల ఐదు వందల టిక్కెట్లు కేటాయింపు జరుగుతోంది. అంటే సగానికి కోత పడింది. అదేవిధంగా ఆయన పర్యవేక్షణలో ఆన్లైన్ మూడు వందల రూపాయలు టిక్కెట్ ఇటీవల వరకు ఇరవై ఐదు వేల రిలీజ్ అయ్యేవి. కానీ వాటిలో సగానికి పైగా అంటే పన్నెండు వేల పైగా పరిమితంగా విడుదల చేస్తున్నారు. ఎటువంటి టోకెన్ లేకుండా కొండమీద ముందుకు పోతే రద్దీ నియంత్రణ పాయింటుతో భద్రతా సిబ్బంది నిలిపి వేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని భక్తులు కోరుతున్నారు.

సంక్షేమ పథకాలకు పెద్దపీట



ప్రజాశక్తి - బుచ్చిరాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో శనివారం మండల అధ్యక్షులు సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గ ఇంచార్జ్ కూరపాటి శంకర్ రెడ్డి, శంకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జ్లు ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలపై కరపత్రాలు పంచారు.

వేద విశ్వవిద్యాలయ 20వ వార్షికోత్సవ వేడుకలు



ప్రజాశక్తి - క్యాంపస్: టీటీడీ ఆర్థిక సౌజన్యంతో నడుస్తున్న శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం 20వ వార్షికోత్సవ వేడుకలు శనివారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని సంధ్యావందనశాలలో నిర్వహించారు. ముందుగా సుదర్శన సహిత పారమాత్మిక హోమ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమ ప్రారంభంలో ఉప కులపతి ఆచార్య రాణిసదాశివమూర్తి, కులసచివులు ఆచార్య పి.భాస్కరుడు హాజరై సంకల్పం కావించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఐకేఎస్ డైరెక్టర్ ఆచార్య తారకరామ కుమార శర్మ, ఫైనాన్స్ అధికారి అంజిరెడ్డి ,సంయోజకులు డా. పి భరత శేఖరాచార్యులు, డా. పి నీలకంఠం,ఆర్ వి సత్యనారాయణాచార్యులు, డా. భావనారాయణా చార్యులు అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

13న వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఈనెల 13న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల ఏడవ కళ్యాణ మహోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) సంఘం ఆధ్వర్యంలో తిరుపతి మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు కుందవరం గిరిబాబు ఆచారి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కళ్యాణ మహోత్సవానికి వీరబ్రహ్మేంద్రస్వామి ఎనిమిదవ తరం ముని మనవడు నొస్సం వీరంభట్లయ్య స్వామి, వేలూరు నారాయణ పీఠంకు చెందిన శక్తి అమ్మవారు, విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం జాతీయ అధ్యక్షులు పులిగల్ల రంగాచారి ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మార్గచార్యుల ఉమాపతి ఆచారి, కమలనాద్ ఆచారి, గోపి ఆచారి, సుబ్రహ్మణ్యం, కమలనాథ ఆచారి, కార్తిక ఆచారి, తిరుమల స్వర్ణకార సంఘం అధ్యక్షులు చంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై హర్షం

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్ర వ్యాప్తంగా వ్యాప్తంగా 2024-25 సంవత్సరానికి ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిల్లో రూ. 600 కోట్లను నేడు విడుదల చేయడంపై తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను గాడిలో పెడుతోందని తెలిపారు. గత ప్రభుత్వం కావలసిన వారికి సౌకర్యాలు కల్పింస్తూ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. గత ప్రభుత్వ బకాయిలను కూడా విడుదల చేయడంతో మంత్రి లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.